క్లుప్తంగా

పేదలకు సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని వివేకానంద పాఠశాల ఆవరణలో శనివారం ఉగాది, రంజాన్ పర్వదినాల సందర్భంగా ఉద్యోగ,ఉపాధ్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో 40 మంది పేద మహిళలకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సేవాసంస్థ అధ్యక్షుడు గురప్ప, గౌరవ అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, కన్వీనర్ బోయిన శంకర్, ఉపాధ్యక్షులు కుమారస్వామి, శ్రీనివాసులు, వర్కింగ్ సభ్యులు నాగభూషణ్ రావు, కో కొన్సిలర్ కరుణాకర్, సభ్యుడు రామేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు కరెంట్ బిల్లుల చెల్లింపు కౌంటర్లు ఓపెన్

గుంతకల్లుటౌన్: విద్యుత్ వినియోగదారులు ఈ నెల 30, 31 తేదీల్లోనూ ఈఆర్ఓ కౌంటర్లలో కరెంట్ బిల్లులను చెల్లించవచ్చని ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్ర, ఏఈ రఘునాథ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుల విజ్ఞప్తి మేరకు ఈఆర్ఓ కౌంటర్లు సెలవు దినాల్లో కూడా ఓపెన్ చేస్తామన్నారు. విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకారమందించాలని వారు కోరారు.
గుత్తి: ఆదివారం ఉగాది పండుగ అయినప్పటికీ గుత్తిలోని విద్యుత్ బిల్లులు కట్టించుకునే కౌంటర్లు పని చేస్తాయని ఏపీఎస్పీ డీసీఎల్ డీఈఈ పద్మనాభయ్య పిళ్లై పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. యథాతథంగా ఆదివారం అన్ని విద్యుత్ బిల్లుల కౌంటర్లు పని చేస్తాయన్నారు.

టెక్నాలజీ, నైపుణ్యాలు అవసరం



సదస్సుకు హాజరైన విద్యార్థులు

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు నూతన టెక్నాలజీ, నైపుణ్యాలు ఎంతో అవసరమని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ చదువుతున్న బీటెక్ విద్యార్థులకు ఎడునెట్ ఫౌండేషన్ అనుబంధంగా ఐఆర్ 4.0ఫౌండేషన్ కోర్స్ పేరిట పైథాన్ ప్రోగ్రామింగ్ బాషపై అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంజినీరింగ్ విద్యార్థులు పట్టు సాధించాలంటే కొత్త టెక్నాలజీపై అవగాహన పెంపొందించు కోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు.కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ భార్గవరెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ వీర ప్రకాష్, సీఎస్ఈ డేటా సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ చిత్ర లింగప్ప, ఐఐఐ సెల్ ముఖ్య కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్‌కుమార్, అధ్యాపకులు కామాక్షమ్మ, లోకేశ్‌నాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: పౌరులందరూ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉషారాణి సూచించారు. శనివారం మండలంలోని క్రిష్టిపాడు ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రం చేసుకుని, గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కాలనీ లోని ప్రధాన సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎవరూ గొడవలకు పాల్పడవద్దని ఆమె సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక



సాయి శ్రీనివాస్ నారాయణ

గుత్తి: పట్టణంలోని శ్రీ సాయి జూనియర్ కాలేజీలో ఇంటర్ (ఎంపీసీ) చదువుతున్న సాయి శ్రీనివాస్ నారాయణ అండర్-20 స్టేట్ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు కోచ్ ప్రసాద్ శనివారం తెలిపారు. గత శుక్రవారం అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జరిగిన సెలెక్షన్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ కనబరిచాడన్నారు. దీంతో సెలెక్టర్లు స్టేట్ ఫుట్ బాల్ అండర్-20 టీంకు ఎంపిక చేశారన్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థిని క్రీడాకారులు, కోచ్‌లు అభినందించారు.

ఊరూరా ఉగాది సందడి

- కిటకిటలాడిన మార్కెట్లు
- ఆలయాలు ముస్తాబు

తాడిపత్రిటౌన్/గుత్తి: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో ఉగాది సందడి నెలకొంది. తాడిపత్రిలోని పలు కూడళ్లు మామిడి ఆకులు, మామిడి కాయలు, వేప పూత, బంతిపూల కొనుగోలుదారులతో కిక్కిరిసి పోయింది. తాడిపత్రి పట్టణంలోని చింతలవెంకటరమణ స్వామి ఆలయం, బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయాలతో పాటు గాయత్రిదేవి ఆలయం, చౌడేశ్వరి ఆలయాలతో పాటు పలు ఆలయాలను పూలు, విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. చింతల వెంకటరమణస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఉగాది సందర్భంగా పెన్నానది ఒడ్డున ప్రత్యేక బరిని ఏర్పాటు చేసి నిర్వాహకులు గ్రామీణ క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేశారు. కర్రసాము, ఇసుక బస్తాలు, రాతిగుండు, ఇరుసు ఎత్తు గ్రామీణ క్రీడలతో పాటు రన్నింగ్, టంగ్‌వార్, స్పూన్ విత్ లెమన్ పోటీలు నిర్వహించనున్నారు. కర్ణాటక, కేరళ తమిళనాడు, బిహార్ రాష్ట్రాల నుంచి మహిళా క్రీడాకారులు రానున్నారు. అలాగే గుత్తిలోని అమృత్ సినిమా థియేటర్ కాలనీ, అంబేడ్కర్ కూరగాయాల మార్కెట్, ఇందిరా గాంధీ కూరగాయాల మార్కెట్, , గుత్తి ఆర్ఎస్‌లోని మార్కెట్ ప్రజలతో కిక్కిరిసిపోయాయి. ముస్తాబైన కోటకొండ ఆంజనేయ స్వామి ఆలయం.



తాడిపత్రిలోని పోలీస్ స్టేషన్ సర్కిల్‌లో పూలు, పండ్ల విక్రయాలు



గుత్తిలోని అమృత్ సినిమా థియేటర్ కాలనీ కిటకిటలాడుతున్న దృశ్యం

పెద్దవడుగూరు: ఉగాది రోజు మండలంలోని కోటకొండ ఆంజనేయస్వామి తిరునాల ఘనంగా ప్రారంభమవుతుంది.. ఈ సందర్భంగా శనివారం మొళకతాళ్ల గ్రామంలో అనంతగిరినాథ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి చిత్రచేడు గ్రామం వరకూ పల్లకీలో ఊరేగించారు. ఆలయ ప్రాంగణాన్ని కమిటీ సభ్యులు సుందరంగా తీర్చిదిద్దారు. ఈనెల 31న ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తామని వారు తెలిపారు.



పెద్దవడుగూరు మండలంలోని కోటకొండ ఆంజనేయస్వామి



తాడిపత్రిలో ముస్తాబైన చింతలవెంకటరమణస్వామి ఆలయం

పామిడి: పట్టణంలోని బీసీసీ రోడ్డు నిత్యావసర సరుకులు, దుస్తులు, పూజా సామగ్రి కోసం వచ్చిన గ్రామీణులతో కిక్కిరిసిపోయింది. అలాగే పట్టణంలోని సరస్వతీ ఉన్నత విద్యా మందిరంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉగాది ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అనంతపురం ఆర్ఎస్ఎస్ కార్యవాహ జగదీష్ ఉగాది పచ్చడి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో గోల్డ్‌షాపు రఘువీర్, ఆర్ఎస్ఎస్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.



పామిడిలో బంతి పూలు విక్రయిస్తున్న దృశ్యం

పండుగ శుభాకాంక్షలు



వై.వెంకటరామిరెడ్డి



కేతిరెడ్డి పెద్దారెడ్డి

గుంతకల్లుటౌన్/తాడిపత్రి టౌన్: గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యేలు వై.వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విశ్వా వసు నామ సంవత్సరంలో సకాలంలో వర్షాలు పడాలని, పాడి పంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబసభ్యులతో సంతోషంగా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు వారు శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

దేవాలయాల వద్ద నిఘా

తాడిపత్రి రూరల్: ఉగాది పండుగను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని వివిధ దేవాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ సాయిప్రసాద్ శనివారం తెలిపారు. పట్టణంలోని సుంకులమ్మ దేవాలయం, పోలిమేర పెద్దమ్మతల్లి తదితర దేవాలయాల వద్ద భక్తుల రద్దీ ఎక్కువ ఉంటుందన్న ఆలోచనతో ముందు జాగ్రత్తగా బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు.

కొనసాగుతున్న బందోబస్తు

తాడిపత్రి పట్టణంలోని వైఎస్సార్సీపీ నాయకుడు ఫయాజ్‌బాషా ఇంటి వద్ద బందోబస్తును కొనసాగిస్తున్నామని సీఐ సాయిప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని 15 మంది చొప్పున రెండు షిఫ్టుల ప్రకారం బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు.

'ఉపాధి' పనులపై ప్రజావేదిక

గుత్తి రూరల్: మండలంలో 2023-24లో జరిగిన ఉపాధి పనుల్లో అవినీతిని తేల్చేందుకు శనివారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకూ ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం వివరాలను పంచాయతీల వారిగా వెల్లడించింది. అందులో పంచాయతీ రాజ్, సెర్ప్, హార్టికల్చర్, అనిమల్ హస్బెండరీ, ఉపాధి హామీ, అటవీ శాఖ, హౌసింగ్‌కు సంబంధించి ప్రజావేదికలో వివరించారు. మండలంలోని 24 పంచాయతీల్లో రూ.15.30కోట్ల నిధులతో పనులు చేపట్టగా అందులో రూ.1.17లక్షలు అవినీతి జరిగినట్లు తనిఖీ బృందం రికవరికి ఆదేశించింది. పనులలో జాప్యంతో పాటుగా ఇతర అంశాలకు సంబంధించి అధికారులు రూ.50 వేలు జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, డ్వామా పీడీ సలీమ్‌బాషా, అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి పర్వేజ్, అంబుడ్స్‌మెన్ వెంకటశివారెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు మల్లేష్‌నాయక్, మంజునాథ్, అశ్విని, ఏపీఓ మద్దిలేటి, ఈసీలు ఈశ్వర్‌రెడ్డి, చెన్నారెడ్డి, బీఎఫ్‌టీ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

టీడీపీ నాయకుల అత్యుత్సాహం

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లిలో టీడీపీ నాయకులు అత్యుత్యాహం ప్రదర్శించారు. శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ నాయకులు గ్రామ సచివాలయం ఎదుట జాతీయ జెండా కోసం ఏర్పాటు చేసిన జెండా కట్టపై ఏకంగా టీడీపీ జెండాను ఎగుర వేశారు. దీంతో టీడీపీ నాయకులు జాతీయ జెండాకు అవమానం చేశారని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ జెండా ఎగుర వేసే స్థానంలో టీడీపీ జెండా ఎగుర వేయడంతో గ్రామ సచివాలయాన్ని టీడీపీ కార్యా లయంగా మార్చారని గ్రామస్తులు మండిపడ్డారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సచివాలయ సిబ్బంది వచ్చి టీడీపీ జెండా ఎగురవేయరాదని తెలపడంతో టీడీపీ జెండా తొలగించారు. కాగా సచివాలయం ఎదుట టీడీపీ జెండా ఎగురవేయం సరికాదని గ్రామ టీడీపీ నాయకులే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం విశేషం.



కనంపల్లి గ్రామ సచివాలయం ఎదుట జెండా కట్టపై టీడీపీ జెండా ఎగురవేసిన నాయకులు

వడ్డీ వందశాతం రద్దు చేయాలి



చైర్‌పర్సన్ భవానికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ వందశాతం రద్దు చేయడంతో పాటు బకాయిలు చెల్లించడానికి మే నెల వరకూ గడువు పొడగించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర తదితరులు కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఏప్రిల్ 2025 నుంచి ఆస్తి పన్ను పెంపును నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు రామునాయక్, షాకీరా, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఒకేషనల్ పరీక్ష

పామిడి: పదో తరగతి ఒకేషనల్ థియరీ పరీక్ష శనివారం ప్రశాంతం జరిగింది. కేవలం స్థానిక టీసీహైస్కూల్ పరీక్ష కేంద్రంలో ఈ పరీక్షకు మొత్తం 238 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రానికి చీఫ్‌గా శ్రీనివాస్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా వెంకటనాయుడు వ్యవహరించారు. ఈ సందర్భంగా సీఐ వీ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ బీఆర్ ప్రసాద్, పోలీసులు పరీక్షా కేంద్రం వద్ద గట్టి బందోబస్తు చేపట్టారు.

నిందితుడి కోసం పోలీసుల వేట

తాడిపత్రి రూరల్: పట్టణంలోని హేమాద్రి గెస్టు హౌస్‌లో ఈ ఏడాది జనవరి 17న భార్యను హత్య చేసిన నిందితుడు వెంకటేశ్వరరెడ్డి కోసం పోలీసులు వేటాడుతున్నారు. రెండు నెలలు దాటినా చిక్కకుండా తప్పించుకొని తిరుగుతూ పోలీసులకు సవాల్‌గా మారాడు. వివరాలు.. పుట్లూరు మండలం వెంగన్నపల్లికి చెందిన నిందితుడు వివాహేతర సంబంధం కారణంగా భార్యను వదిలిపెట్టాడు. భర్త నిరాదరణతో పుట్టింటికి వెళ్లిన భార్య ఉన్న ఆస్తిని వివాహేత సంబంధం కలిగి ఉన్న మహిళకు ఖర్చు చేస్తాడన్న అనుమానంతో భర్తకు ఫోన్ చేసి కొడుకు పేరు మీద ఆస్తిని రాయించాలని తరుచుగా ఒత్తిడి తెచ్చేది. భార్యను అడ్డు తొలగించుకోవాలన్న ఉద్దేశ్యంతో పంచాయతీ పేరుతో వారి బంధువులతో పాటు భార్యను పిలిపించి హేమాద్రి గెస్టు హౌస్‌లో రెండు గదుల్లో ఉంచాడు. భార్యతో రహస్యంగా మాట్లాడాలని పంచాయతీకి వచ్చిన వారితో చెప్పి మరో గదిలోకి పిలిపించుకొని ఆమెను విచక్షణారహితంగా నరికి హత్య చేశాడు. ఈ కేసులో నిందితునిగా ఉన్న అతడు పోలీసులకు దొరకకుండా పరారీలో ఉన్నాడు. నిందితుని కోసం తాడిపత్రి టౌన్ సీఐ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా నిందితుడు స్వగ్రామమైన వెంగన్నపల్లిలోని బంధువులు, చుట్టుపక్కల వారికి ఫోన్ చేసి కుటుంబ సభ్యులతో మాట్లాడాలంటూ ఫోన్ చేసేవాడు. నిందితుడి ఫోన్‌ను అబ్జర్వేషన్‌లో పెట్టిన పోలీసులు వారిని విచారణ కోసం పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చేవారు. దీంతో మరోసారి నిందితుడి ఫోన్ లిఫ్ట చేయకుండా జాగ్రత్తపడేవారు. అయినా నిందితుడు పలు నంబర్లతో ఫోన్ చేస్తూ గ్రామస్తులను ఇబ్బంది పెడుతున్నాడు. మరోవైపు నిందితుని కోసం గాలింపు చర్యల్లో భాగంగా వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారి మఠానికి వెళ్లారు. అక్కడ రైతు వద్ద కూలీగా పనిచేస్తూ అతని మోటర్‌సైకిల్‌తో నిందితుడు పరారయ్యాడని పోలీసులు గుర్తించి తిరిగి వచ్చారు. ఈ కేసు విషయమై సీఐ మాట్లాడుతూ త్వరలో నిందితుడిని అరెస్టు చేస్తామన్నారు.

పశువుల షెడ్ల ప్రారంభం

బుక్కరాయసముద్రం: కొర్రపాడు పంచాయతీలోని నీలారెడ్డిపల్లిలో పశువుల షెడ్లును ఎమ్మెల్యే బండారు శ్రావణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి పథకం కింద పశువుల, గొర్రెలకు షెడ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. ఈ షెడ్లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మాన్, పంచాయతీ రాజ్ ఈఈ మద్దిలేటి, ఏపీఓ పోలేరయ్య, ఈసీ శివ రామక్రిష్ణ, పంచాయతీ సెక్రటరీ సర్దార్‌వలి, టెక్నికల్ అసిస్టెంట్ కోమల, పసుపుల శ్రీరామిరెడ్డి, కుళ్లాయిస్వామి, హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'విద్య, వైద్యం పేరుతో దోపిడీ'

పామిడి: కూటమి ప్రభుత్వ పాలనలో విద్య, వైద్యం కార్పొరేటీకరణ వైపే మొగ్గుచూపుతుడడంతో పేదలు దోపిడీకి గురవుతున్నారని భారతీయ భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు సాకే ఓబులేసు ధ్వజమెత్తారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్న అనుమతులు లేని ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటళ్లను వెంటనే రద్దు పరచాలన్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలన్నారు. పేదలకు స్థలాల కేటయింపుతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. భూమి లేని పేదలకు భూములు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షాన పేదలను సంఘటితం చేసి ఉద్యమిస్తామన్నారు.

టీడీపీలో విభేదాలు బట్టబయలు

గుత్తి: టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో నాయకుల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. గుత్తిలో మాజీ ఎమ్మెల్యే జితేందర్ గౌడ్ వర్గం, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వర్గం వేర్వేరుగా పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాయి. జితేందర్ గౌడ్ వర్గీయులైన జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్ చౌదరి, మాజీ ఎంపీపీ వీరభద్రయ్య, టౌన్ బ్యాంకు ప్రెసిడెంట్ అబ్దుల్ జిలాన్, టౌన్ మాజీ అధ్యక్షుడు ఐడియా రవి, జిల్లా మైనార్టీ నాయకులు హాజీవలి తదితరులు ఎన్టీఆర్ సర్కిల్లో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ఆధ్వర్యంలో మరో వర్గం ఎన్టీఆర్ సర్కిల్లో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఇన్నాళ్లు అంతర్గతంగా ఉన్న గ్రూపులు ఆవిర్భావ దినోత్సవం రోజు బహిర్గతమయ్యాయి. ఇదిలా ఉండగా చాలామంది సీనియర్ నాయకులు తమకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు.

బైక్ బోల్తా.. యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం రాత్రి ద్విచక్రవాహనం బోల్తా పడి అశోక్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. వజ్రకరూరు మండలం గూళ్యపాళ్యం గ్రామానికి చెందిన అశోక్ కర్నూలులోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. అయితే శ్రీపురం గ్రామ శివారులో రోడ్డు డైవర్షన్ కోసం వేసిన మట్టి కుప్పను గమనించకుండా వేగంగా వెళ్లి ఢీకొన్నాడు. ప్రమాదంలో అశోక్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన వాహనదారులు 108లో అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆశా వర్కర్‌కు ఆర్థిక సాయం



ఆశా వర్కర్ పద్మావతిని పరామర్శిస్తున్న వైద్య సిబ్బంది

శింగనమల: మండలంలోని గోవిందరాయునిపేట సమీపంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఆశా వర్కర్ పద్మావతికి తరిమెల పీహెచ్‌సీ వైద్యం సిబ్బంది రూ.85 వేలు ఆర్థిక సాయం శనివారం అందజేశారు. కార్యక్రమంలో తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు శంకర్ నాయక్, ఈహెచ్ఓ దివ్య , ఏఎన్ఎం శైలజా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కూలిన విద్యుత్ స్తంభం.. చెలరేగిన మంటలు



ఊబిచెర్లలో కూలిన స్తంభం

గుత్తి రూరల్: ఊబిచెర్ల గ్రామ శివారులో శనివారం విద్యుత్ స్తంభం నేలకూలడంతో మంటలు చెలరేగాయి. రైతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులోని గట్టుస్వామి ఆలయానికి వెళ్లే దారి పక్కనున్న విద్యుత్ స్తంభం ఒక్కసారిగా వీచిన గాలులకు నేలకూలింది. స్తంభం ఓ వైపునకు ఒరిగి విద్యుత్ తీగలు నేలకు తాకి నిప్పురవ్వలు ఎగిసి పడటంతో మంటలు చెలరేగాయి. ఆలయానికి వెళ్లే దారి పక్కనున్న చెత్తాచెదారం అంటుకొని పెద్ద ఎత్తున మంటలు వ్యాపిస్తుండటంతో రైతులు గమనించి పరుగున అక్కడకు చేరుకుని అటుగా ఎవరూ రాకుండా చూశారు. స్తంభం కూలిన తర్వాత రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా అలానే ఉంది. అనంతరం రైతులు అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరా నిలిపివేయించారు.

కోర్టు క్లర్క్‌కు సన్మానం

తాడిపత్రి రూరల్: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం రాత్రి సివిల్ బెంచ్ క్లర్క్ సావిత్రమ్మను న్యాయవాదులు, సిబ్బంది సన్మానించారు. ఈ నెలాఖరులో ఆమె రిటైర్ట్ కానుండటంతో జరిగిన సన్మాన కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి క్రిష్ణవేణి పాల్గొన్నారు.

1న రాతి దూలం లాగుడు పోటీలు

పుట్లూరు: మండలంలోని నాయకునిపల్లి సమీపాన బాట సుంకులమ్మ ఆలయం వద్ద ఏప్రిల్ ఒకటో తేదీ రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఒంగోలు జాతి వృషభాల రాతి దూలం లాగుడు పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానికి మొదటి బహుమతి రూ.60వేలు, రెండో బహుమతి కింద రూ.50 వేలతో పాటు మొత్తం 11 బహుమతులు అందించనున్నారు.
6న రంగమనాయునిపల్లిలో..
ఏప్రిల్ 6న రంగమనాయునిపల్లి ఆంజనేస్వామి ఆలయం వద్ద శ్రీరామనవమిని పురస్కరించుకుని రాతి దూలం లాగుడు పోటీలతో పాటు యువకులకు పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్ తదితర పోటీలు నిర్వహించనున్నారు. రాతిదూలం లాగుడు పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానికి మొదటి బహుమతి రూ.60వేలు, రెండో బహుమతి రూ.40వేలు, మూడో బహుమతి కింద రూ.25 వేలు, నాల్గో బహుమతి కింద రూ.10 వేలు అందించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.